నిర్మాణానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు


ఉండిలో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన వెలుగు సంఘ భవనం


పెదకాపవరంలో మధ్యలోనే నిలిచిపోయిన బాల సదన్ భవనం


కాళ్ల మండలంలో మధ్యలోనే నిలిచిపోయిన డ్వాక్రా భవనం

ఏడేళ్లుగా మొండి గోడలతో దర్శనమిస్తున్న భవనాలు

ఉండి: నియోజకవర్గంలో పలు ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఉండిలో ఏడేళ్లుగా వెలుగు సంఘ భవనం మొండిగోడలతో నిర్మాణం కొరకు ఎదురు చూస్తుంది. రూ.40 లక్షల అంచనాలతో ప్రారంభమైన భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. వీటిలో రూ.30 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కాగా మిగతావి రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా చెబుతున్నారు. నిర్మాణం జరిగిన దానికి సుమారు రూ.19.30 లక్షల వరకు చెల్లింపులు జరిగినట్లు సమాచారం.డ్వాక్రా అక్కచెల్లెమ్మల సమావేశాల కోసం నిర్మాణం చేస్తున్నట్లు చెప్పిన నాటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు దానిని మధ్యలోనే విడిచిపెట్టేశారు. అయితే ఏళ్లుగా ఆయా భవనాల నిర్మాణాన్ని అటకెక్కించడంతో ఆ భవనాల ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. అయితే భవన నిర్మాణలను వేగవంతం చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. ముఖ్యంగా ఏళ్లుగా జిల్లాస్థాయి అధికారులు మాత్రం ఆయా భవనాల నిర్మాణంపై శ్రద్ధ చూపించలేదన్నది సజీవసాక్ష్యంగా కనబడుతుంది.

వాహనాల పార్కింగ్‌లా మారిన భవనం

లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మాణం చేపట్టిన వెలుగు సంఘ భవనం స్థానిక వాహనాలకు పార్కింగ్‌లాగా మారింది.అదే విధంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, గుట్కా మెటీరియల్ వంటివి నిలువ చేసేందుకు భవనం పనికొచ్చింది. అలాగే పశువులు,మూగజీవాల ఆవాసంలా కూడా పనికి వస్తుంది.కానీ డ్వాక్రా సంఘ అక్కచెల్లెమ్మలకు మాత్రం పనికిరాకుండా ఉంది. అలాగే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోను పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఆకివీడు మండలం పెదకాపవరంలో రూ.40 లక్షల అంచనాలతో నిర్మాణం చేపట్టిన బాలసదన్ భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయి నిరుపయోగంగా మారింది. కాళ్ల మండలం కాళ్లలో డ్వాక్రా సంఘ భవనం రూ.40 లక్షల అంచనాలతో పారంభమై నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.6.15 కోట్లతో రోడ్లకు మరమ్మతులు


గుమ్ములూరు రోడ్డుకు మరమ్మతులు చేసిన దృశ్యం

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో తూట్లు పడ్డ రహదారులకు మాట్లు(ప్యాచ్‌వర్క్) వేసేందుకు రూ. 6.15 కోట్లు మంజూరు అయ్యాయి. ఉండి మండలంలోని పలు రోడ్లకు అధిక నిధులు కేటాయించగా, ఆకివీడు మండలంలో అతి తక్కువ నిధులు ప్యాచ్‌వర్కులకు కేటాయించారు. ఉండి మండలానికి రూ. 2 కోట్లు, పాలకోడేరు మండలానికి రూ. 1.90 కోట్లు, కాళ్ళ మండలానికి రూ. 1.75 కోట్లు, ఆకివీడు మండలానికి రూ. 50 కోట్లు కేటాయించారు. ఎంపిక చేసిన రోడ్లలోనే ప్యాచ్‌వర్కులు చేపట్టారు. పలు గ్రామాల్లో తీవ్రంగా ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా నిధులు ఉండి పనులు జరగక పలు రోడ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఆకివీడు మండలంలో పెదకాపవరం-కొల్లేరు, పెదకాపవరం-క్రొవ్విడి, చెరుకుమిల్లి-ఏలూరుపాడు రోడ్డు, అజ్జమూరు-కోనలపల్లి రోడ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఆయా రోడ్ల విస్తరణకు కేంద్ర రోడ్ల నిధులు మంజూరు అయినప్పటికీ నిధులు లేక పనులు ప్రారంభించలేదని ఆర్ అండ్ బీ జేఈ శ్రీహరి చెప్పారు. నిధులు మంజూరు అయి ఆయా ప్రాంతాల్లో కొంత మేర పనులు జరుగగా, వర్షాల కారణంగా పనుల్ని నిలుపుదల చేశారు. ప్రస్తుతం ఆయా పనులు చేపట్టేందుకు నిధులు విడుదల కాలేదని జేఈ తెలిపారు.

జోరుగా ఖరీఫ్ మాసూళ్లు


గుమ్ములూరులో ఆరబెట్టిన ధాన్యం

ఆకివీడు: మండలంలో ఖరీఫ్ మాసూళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పుడిప్పుడే విత్తనాల కోసం సాగు చేసిన పంట కోత కోస్తున్నారు. మరికొన్ని చోట్ల కోతకు సిద్ధంగా ఖరీఫ్ పంట ఉంది. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో 56 ఎకరాల ఖరీఫ్ పంట మాసూళ్లు పూర్తి చేసుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయితే యంత్రాలతో కోయడం వల్ల ధాన్యంలో తేమ శాతం ఉండడంతో దానిని తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబెట్టారు. ఇప్పటికే మండలంలో ఏడు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆకివీడులో రెండు కేంద్రాలు, సిద్ధాపురం, చినకాపవరం, చినమిల్లిపాడు, చెరుకుమిల్లి, అజ్జమూరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సంచులు అందుబాటులో ఉంచారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఏ రైస్‌మిల్లులోనైనా అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక చెప్పారు.

పౌర సరఫరాల గిడ్డంగి ఆకస్మిక తనిఖీ

నరసాపురం రూరల్: ప్రతి రేషన్‌కార్డుదారునికీ బియ్యం, కందిపప్పు, పంచదార అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ దాసి రాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన నరసాపురం మండలం సరిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని పౌర సరఫరాల మండలస్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్‌ఎస్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డిసెంబర్ నెలకు సంబంధించి గోడౌన్ వద్ద ఉన్న రేషన్ సరుకుల వివరాలను పరిశీలించారు. రేషన్‌కు సంబంధించి 80 శాతం కందిపప్పు, 100 శాతం పంచదార నిల్వలు ఉన్నాయని తెలిపారు. డీటీ ఐతం సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుకి ఇష్టమైన మిల్లులో ధాన్యం విక్రయం

పాలకొల్లు అర్బన్/పెనుగొండ: రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యాన్ని రైతులు తమకిష్టమైన రైస్‌మిల్లులో ధాన్యం విక్రయించుకోవచ్చని ఆర్డీవో దాసి రాజు చెప్పారు. పోడూరు మండలం జిన్నూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కల్లాల్లో ధాన్యం ఎగుమతి చేసిన వాహనాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లాల్లో రైతులతో ఆర్డీఓ మాట్లాడారు. తేమశాతం, గోనె సంచులు, వాహన రవాణా, మద్దతు ధర తదితర అంశాలను రైతులకు వివరించారు. ధాన్యం కల్లంలో సిద్ధం చేసిన వెంటనే సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేస్తారన్నారు.

ఇందిరాగాంధీ హయాంలో పేదలకు మేలు

భీమవరం: మహిళా సాధికారిత కోసం దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎంతగానో కృషి చేశారని, ఆమె పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందని మాజీ ఎంపీ, కనుమూరి బాపిరాజు అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో ఇన్‌చార్జి అంకెం సీతారామ్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ శానిటరీ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. వార్డుల్లో సరిపడగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమంచి ఎక్కడా పారిశుద్ధ్య ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. డ్రెయిన్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ తదితరులు ఉన్నారు.

భీమవరం యూత్ హాస్టల్స్‌కు అవార్డు


యూత్ హాస్టల్స్‌కు అవార్డు అందిస్తున్న డాక్టర్ సోమరాజు

భీమవరం: విజ్ఞానం, వినోదంతోపాటు యువతకు శారీరక పరిపుష్టికి యూత్ హాస్టల్స్ ఉద్యమాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యూత్‌హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్ఏఐ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సోమరాజు పిలుపు నిచ్చారు. భీమవరం వైహెచ్ఏఐ యూనిట్ 2023–24 సంవత్సరానికి ఉత్తమ యూనిట్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత దేశంలోనే భీమవరం రెండో అతిపెద్ద యూనిట్‌గా గుర్తింపు తెచ్చుకొందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా గత నాలుగేళ్లుగా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకట నర్సింహ సీతారామరాజుకు డాక్టర్ సోమరాజు అవార్డును అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి నందమూరి రాజేష్, కొరల్ జూబ్లీ కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాసరావు, ఆరేటి వెంకట సత్యనారాయణ, కంతేటి వెంకట్రాజు, కట్రేడ్డి సత్యనారాయణ, కటికిరెడ్డి వెంకటరత్నం, పేరిచెర్ల లక్ష్మణవర్మ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, తాళ్లపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


భారతీయ విద్యాభవన్స్‌లో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి


కాళ్ల: కొప్పల్లె గ్రంథాలయంలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న దృశ్యం


ఆకివీడు: మాదివాడ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారమని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయ శాఖ చదువురుల సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భారతీయ విద్యా భవన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 300 అడుగుల జాతీయ జెండాతో జాతీయ సమైక్యతను చాటే విధంగా ఏర్పాటుచేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవీ పద్మ, రఘుపతిరాజు, చెరుకువాడ రంగసాయి, స్కూల్ ఉపాధ్యాయులు పైడిరాజు, భాష, ప్రకాష్, దుర్గా ప్రసాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంబన కలిగి ఉండాలని పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్ ఉపాధ్యాయిని కె.అన్నామని అన్నారు. భీమవరంలోని డాక్టర్ వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అన్నామని, మహిళా పోలీసు షహనాజ్ మాట్లాడారు. అనతరం విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ స్థానిక ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజ భవనం) బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు అంశాలపై ప్రముఖులు ప్రసంగిస్తారని, విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షల హాజరయ్యే యువత పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొల్లలకోడేరులో..

పాలకోడేరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మండలంలోని గొల్లలకోడేరు గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జి.బాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతంర బాలరాజు మాట్లాడుతూ వారం రోజులుగా జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళాపోలీస్ బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై చర్చ

కాళ్ల: 57వ జాతీయగ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కోపల్లె శాఖా గ్రంథాలయంలో మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చినఅమీరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.అనురాధ మాట్లాడుతూ విద్య, అవగాహన, అక్షరాస్యత, శిక్షణ ద్వారా మహిళల స్థితిని పెంచవచ్చన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.స్వరూపరాణి, బొండాడ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకం... మన నేస్తం

ఆకివీడు: పుస్తకం... మన నేస్తం, ఎక్కడ పుస్తకం కన్పించినా చదవడం ఎంతో ఉత్తమమని విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి చెప్పారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలుగా మన గ్రంథాలయాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అడ్వకేట్ నెల్లి సతీష్, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, రీడర్స్‌ఫోరం అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి పార్వతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సుజాత అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాలు, జాతీయ సమగ్రతా దినోత్సవం నిర్వహించారు.

ఉండిలో..

ఉండి: తల్లిదండ్రులు వివిధ అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని యండగండి కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు కె.రవికుమార్ అన్నారు. మంగళవారం యండగండి, ఉండి శాఖ గ్రంథాలయాల్లో 57వ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యండగండిలో మహిళ సంరక్షణ వారి భద్రత అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు పి.మమత, వెంకరమణ, ఎస్‌కే ఖతియాబీబీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ రామకృష్ణ, అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, ఉండిలో నల్లా ఫౌండేషన్ చైర్మన్ నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, శశి స్కూల్ చైర్మన్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళల పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

వీరవాసరం: విద్యార్థి దశలోనే కళల పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజానాట్య మండలి కళాకారుడు, మ్యాజిక్ మురళి స్మారక పాటల పోటీలను వీరవాసరం మండలం రాయకుదురు జెడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో కె.వెన్నెల, ఎ.భావన, ఎం కీర్తన, జూనియర్స్‌లో విల్లా పూజిత, మంజు, జె.లాస్యలు మొదటి మూడు బహుమతులు సాధించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కళా రంజని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు మాట్లాడారు. ఉపాధ్యాయులు అంగర వేణు, కాయలు వీరస్వామి, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో ఉన్న భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ – 2024 ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ తెలిపారు. ఫిషరీస్, యానిమల్ హస్బండ్రీ అండ్ డెయిరీ మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమస్యకు పరిష్కారాన్ని ప్రతిపాదించి దేశం నుంచి 5 టీమ్స్ సెలెక్ట్ కాగా దానిలో తమ కళాశాల టీం ఎంపికయ్యారని ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ 11 నుంచి 15 వరకు ఐఈఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్, భోపాల్‌లో జరిగే ఫైనల్ పోటీలో పాల్గొని తమ ప్రాజెక్టుని ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎస్ఐహెచ్ ఎస్పీఓసీ ఏబీఎస్ ఆర్.మనోహర్, అకడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు తదితరులు అభినందించారు.

ఉత్తమ శిక్షణతో ఉన్నత విద్యాబోధన


ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలిస్తున్న ఏపీసీ శ్యామ్‌సుందర్

ఉండి: ఉపాధ్యాయుల ఉత్తమ శిక్షణతోనే విద్యార్థులకు ఉన్నత విద్యాబోధనలు అందిస్తారని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్ అన్నారు. మంగళవారం ఉప్పులూరు జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించేందకు గాను ఉపాధ్యాయులకు పలు రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్య ప్రవేశ్, టీచర్స్ ప్రొఫిషియన్సీ డెవలప్‌మెంట్(టీపీడీ), ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), టెక్ టూల్ స్కూల్ లీడర్‌షిఫ్ వంటి శిక్షణా కార్యక్రమాలను చేపట్టి ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అప్‌డేట్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ అక్బర్ చక్రవర్తి, మహదేవపట్నం, యండగండి, ఉప్పులూరు స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైస్కూల్ పని వేళల్లో మార్పు తగదు

ఆకివీడు: ఉన్నత పాఠశాలల్లో పని వేళల్లో మార్పు చేయాలని ప్రభుత్వ యోచనను విరమించుకోవాలని మండల యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి ఆర్వీఎస్ నారాయణ(విక్రమ్) డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా హైస్కూల్స్ 7 గంటలు పని చేస్తున్నాయనీ, కోటారీ కమిషన్ సూచనలకు అనుగుణంగా ప్రస్తుత సమయాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు మీడియంలో బోధన కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని బట్టి హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్‌చేశారు. లీడర్ షిప్ ట్రైనింగ్ ఇబ్బందులను తొలగించాలని విక్రమ్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా మధ్యంతర భృతి, డీఏ, బకాయిలను ప్రకటించలేదని విక్రమ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రావిడెంట్ ఫండ్, సంబంధిత సెలవుల బకాయిల విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర నిరాశతో ఉన్నారని చెప్పారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

పెనుగొండ: రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారుతున్న ట్రూఅప్ చార్జీలను తక్షణం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆచంట మండలం 8వ మహాసభ మంగళవారం ఆర్యవైశ్య క్షేత్రంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చార్జీలు తగ్గిస్తామని చెప్పి, నాలుగు నెలలకే రూ.18 వేల కోట్లు భారం ప్రజలపై మోపిందన్నారు. కార్యక్రమంలో అల్లం నాగమ్మ, తలుపూరి బుల్లిబ్బాయి, సిర్రా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


రోటరీ క్లబ్‌కు విరాళం అందిస్తున్న మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు

భీమవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అన్నారు. భీమవరం రోటరీ పార్క్‌లో మొక్కలు నాటడానికి రూ.25,500 మార్నింగ్ కాఫీ క్లబ్ తరపున మంగళవారం రోటరీ క్లబ్‌కు అందించారు. పట్టణ సుందరీకరణకు అందరి సహకారం అవసరమని పార్క్‌లో మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని రాంబాబు అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, మండా విజయ భాస్కర్, మార్నింగ్ కాఫీ క్లబ్ కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, జూలూరి రాజా, కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో వైభవంగా హోమాలు

ఉండి: కార్తీక మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉండి రాజులపేటలో ఉన్న పార్వతీసమేత చెన్నలమల్లేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీకమాస పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సంకట హర చతుర్థిని పురస్కరించుకుని లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, అష్టలక్ష్మీ హోమం, రుద్ర హోమం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి చెరుకురసంతో అభిషేకం, ప్రత్యేకాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలను అర్చకులు సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు చలపతిరావు తదితరులు నిర్వహించారు.

వాహనాల రిజిస్ట్రేషన్లపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖాధికారి ఉమామహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): వాహన రిజిస్ట్రేషన్ సమయంలో పత్రాలను ఆన్‌లైన్‌లో సరిగ్గా అప్‌లోడ్ చేయాలని జిల్లా రవాణాధికారి టి.ఉమామహేశ్వరరావు సూచించారు. జిల్లాలోని వివిధ వాహన డీలర్లకు భీమవరంలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వాహన పత్రాలను సరిగ్గా అప్‌లోడ్ చేయకపోతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతుందని తెలిపారు. వినియోగదారుల నుంచి అదనపు రుసుము వసూలు చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో రవాణా అధికారులు కె.ప్రసాద్, కె.ధనలక్ష్మి, ఎ.తేజ, వై.జయనాగు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురిపై కేసు

కాళ్ల: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామశివారులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.6,900 నగదు స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెనుగొండ: ఆచంటలో పాలకొల్లు ఎక్సైజ్ అధికారులు, ఈఎస్‌టీఎఫ్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన దాడుల్లో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. కరణి శ్రీనివాసు అనే వ్యక్తి నుంచి ఆరు మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా


పెనుగొండ శివారు అదుపు తప్పి పంటబోదేలో బోల్తాపడిన ట్రాక్టరు

పెనుగొండ: పెనుగొండ శివారు నక్కల డ్రెయిన్ సమీపంలో ఇటుకల లోడు ట్రాక్టరు అదుపు తప్పి పంటబోదేలో బోల్తా పడింది. మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి నుంచి భీమవరం వైపు వెళుతూ ట్రక్కుకు ఉన్న పిన్ను ఊడిపోవడంతో పంటబోదేలోకి దూసుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ట్రాక్టరుపై ఉన్న కూలీలకు గాయాలు కావడంతో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.